
ఆకాశం ఎర్ర బడింది.

బామ్మ గారు నిద్ర లేచి ఎదురుగా సీతారామ లక్ష్మణులతో ఉన్న శ్రీరామచంద్రుడికి చేతులు జోడించి నమస్కారం చేసింది.

# బాధలేని పాట

పులిపాక శ్రీరామచంద్రమూర్తి

"కోదండ రాము డంట అమ్మలాల
వాడు కౌసల్య కొడుకంట అమ్మలాల
ఆజానుబాహు డంట అమ్మలాల
వాడు అరవింద నేత్రు డంట అమ్మలాల"



మెల్లిగా పాడుతూ మొహం కడుక్కుని, వేణ్నీళ్లతో స్నానం చేసింది. చలి కాలం, సూర్యుడు బైటికి వద్దామా వద్దా అనే ఆలోచనలో పడినట్టున్నాడు. ఆకాశం మీద మబ్బు ముక్కలు అతికించిన ట్టున్నాయి.

బామ్మ గారి పేరు యశోదమ్మ గాని అందరూ బామ్మ గారూ, బామ్మ గారూ అని పిలుస్తుండటంతో ఆ పిలుపుకు అలవాటు పడి పోయి తన అసలు పేరు మరిచి పోయింది.

నాలుగు గదుల ఇల్లు, ఇంటి ముందు ఆవరణలో పెనవేసుకున్న రావి చెట్టు, వేప చెట్టు (ఆ రెండింటికీ పెళ్లి చేసింది కూడా) ఇంట్లో ఓ పక్క పది బస్తాల ధాన్యం, చిన్న టీవీ, రేడియో, పెరట్లో తులసి మొక్క, కొన్నాళ్లు పక్క గదిని ఓ కాలేజీ కుర్రాడికి అద్దె కిచ్చింది గాని, వాడు ఇంటి మీదికి తగాదాలు తెచ్చే 'వెధవ' కావడంతో ఖాళీ చేయించింది. ఆవిడ పేరున నాలు గెకరాల పొలం ఉంది. భర్త సూర్యనారాయణ చని పోయిన దగ్గర్నించి ఆయన పింఛను డబ్బొచ్చి బ్యాంక్ అకౌంట్‌లో పడుతూ ఉంటుంది. బ్యాంకు కూడా దగ్గరే. అదులో పని చేసే వాళ్లు 'మంచి వెధవలే.' ఆవిడని చూడగానే త్వరగానే డబ్బు లిచ్చేస్తూ ఉంటారు.

మెల్లిగా పెరట్లోకి వెళ్లి తులసి మొక్కకి పసుపు రాసి, బొట్టు పెట్టి 'శుక్లాంబరధరం విష్ణుం, శశి వర్ణం చతుర్భుజం, ప్రసన్న వదనం ధ్యాయేత్, సర్వ విఘ్నోపశాంతయే' ' అని రాగయుక్తంగా పాడింది. తర్వాత అంట్ల గిన్నెలు పెరట్లో తొట్టి దగ్గర చేర్చి తోమింది.

వెధవ కూరగాయలు ఎక్క డున్నాయో నని వెదికి, హాల్లో స్టూలు మీదున్న బుట్టలోని కూరగాయలు తెచ్చి తరిగింది. బియ్యం కడిగి గ్యాస్ స్టౌ అంటించి పెట్టింది.

పాల వా డొచ్చాడు. ఆ వెధవేం మాట్లాడి చావడు, ఫస్ట్ తేదీన డబ్బులు అడగడం తప్ప. కాఫీకి నీళ్ల గిన్నె పెట్టి పొడి వేసింది. పాలు కాగబెట్టి పెద్ద గ్లాసు నిండా కాఫీ పోసుకుని ఆరారగా తాగింది.

కూరా, పప్పూ 'అన్ని పాట్లూ సాపాటు కోసమే' ననుకుంటూ చేసేసి. అన్నం దించి స్టౌ ఆర్పేసి బట్టలు పెరట్లోకి తీసుకెళ్లి ఉతికి ఆరేసి లోపలికి వచ్చి రేడియో వెధవ ఏం చెబుతాడో నని ఆన్ చేస్తే "వస్తావా ... ఇస్తాను" అనే పాట వినిపించే సరికి బామ్మ గారు ఆగ్రహావేశాలతో మండి పడి పోయి టక్కున రేడియో పీక నొక్కేసింది.

ఇహ టీవీలో ఏం చూపిస్తాడో నని భయపడుతూనే ఆన్ చేస్తే 'పందుల్ని పెంచడం ఎలా? అనే కార్యక్రమం చూస్తా'రనే ప్రకటన ముద్దు ముద్దు భాషలో విని కేంద్ర ప్రభుత్వాన్ని, ప్రధాన మంత్రిని తిట్టేసి ఆపేసింది.

ఉదయం పదకొండు గంట లైంది.

తన కొచ్చిన త్యాగరాజ కీర్తనలు పాడుకుంటూ భగవద్గీత తీసింది. కొన్ని శ్లోకాలు చదివి ఆ గ్రంథం మూసేసి, పత్తి తెచ్చి వత్తులు చేయడం ప్రారంభించింది, జీవన వ్యాపారం తప్పదు గదా అనుకుంటూ.

బామ్మ గారికి పదహారో ఏటే పెళ్లయింది. ఆవిడ భర్త స్కూలు టీచరు. అత్తారిల్లు ఉమ్మడి కుటుంబం. ఇంటి నిండా మనుషులే. నడుం వంచితే ఎత్తే పని ఉండేది కాదు. తర్వాత అన్నదమ్ములు విడి పోయి ఆస్తులు పంచుకున్నాక ఈ ఇంట్లోకి వచ్చేసిం దావిడ. ముగ్గురు మగ పిల్లలు, ఒక ఆడ పిల్ల కలిగారు. వాళ్ల బతుకులు వాళ్లు బతుకుతున్నారు. సూర్యనారాయణ ఎంతకీ తగ్గని ఉబ్బసం వ్యాధితో చని పోయాక ఆవిడ ఒంటరిదై పోయింది.

"పోస్ట్!" అనే కేకతో పాటు ఓ కార్డు ముక్కొచ్చి లోపల పడింది. ఎవరు రాశారు? దగ్గర కెళ్లి తీసుకుని చదివింది.

"అమ్మకి నమస్కారాలు. నాన్న సంవత్సరీకాలు ఈ నెల ఇరవై ఏడో తేదీన మా ఇంట్లో నిర్వహిస్తున్నాము. తమ్ముళ్లూ, చెల్లాయి వస్తారు. నువ్వు కూడా రా.

"ఇట్లు నీ పెద్ద కుమారుడు రాజశేఖర శాస్త్రి.'
'

అది చూసి యశోదమ్మ నవ్వుకుంది. ఎందుకూ వెళ్లడం ఈ వయసులో? పైగా దూరాభారం. అదీ గాక .. మళ్లీ నవ్వుకుంది. ఎవరి ఇళ్లకీ కెళ్లడం తన కిష్టం లేదు. ఐదారేళ్ల క్రితం వెళ్తే ఈ రాజశేఖరు డేం అన్నాడు?

"ఇది హైదరాబాద్ నగరం. ...ఖర్చెక్కువ."

"అయితే ఏంట్రా?"

"నేనూ, సుశీలా, ముగ్గురు పిల్లలూ బతకాలి. నా కొచ్చే జీతం ఐదు వేలు. అందుకని ..."

"అందుకని?"

"నువ్వు చంద్ర శేఖరుడి దగ్గర కెళ్లడం మంచి దని నా ఉద్దేశం.'
'

"పిచ్చి నాన్నా!" అని నవ్వేసి రెండో వాడి దగ్గరికి వెళ్లింది. వాడు మరీ వెర్రి వెధవ! నెల రోజులు బాగానే చూసుకున్నాడు గాని చలి కాలం కావడం వల్ల తనకి దగ్గూ, ఆయాసం వస్తే తెగ విసుక్కున్నాడు.

"చూడవే అమ్మా. ... నువ్వు రాత్రి వేళ అలా అస్తమానం దగ్గుతుంటే నాకు నిద్ర పట్టడం లేదు."

"ఏరం చెయ్య మంటావు? డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లు."

"తీసుకెళ్ల చ్చనుకో. మందులు తెచ్చుకోవ చ్చనుకో. కాని అదంతా అనవసరం!"

"ఎందుకనిరా?"

"వృద్ధాప్యమే ఒక పెద్ద జబ్బు. ఎన్ని మందులు వాడినా ఈ వయసులో ఉపయోగం ఉండదు. అందుకని ఓ పని చెయ్."

"ఏం చెయ్య మంటావురా?"

"చిన్న వాడు ఉదయ భాస్కరుడు డాక్టరే కదా. వాడి దగ్గరికి వెళ్లు."

"పిచ్చి కన్నా!" అని వాడి తల నిమిరి నవ్వేసి మూడో వాడి దగ్గరికి వెళ్లింది. వాడు మంచి వాడే గాని కోడలు పిల్ల గడుగ్గాయి. మర్యాద కూడా మూన్నాళ్లే చేసింది ముచ్చటగా.

"చూడండి అత్తయ్య గారూ!"

"ఏమ్మా?"

"మేం ఇద్దరం ఉద్యోగాలు చేసుకుం టున్నాం. పొద్దున్నే వెళ్తే ఎప్పుడో గాని రాం. మీరు పగ లంతా ఒంటరిగా ఏం చేస్తారు? ఏం తోచి చావదు గదా, అందుకని ..."

"అందుకని?"

"మీ అమ్మాయి వసుంధర దగ్గర కెళ్తే ..."

బామ్మ గారు కళ్లొత్తుకుని ఆ 'పిచ్చి పిల్ల'ని ఆశీర్వదించి వెళ్లి పోయింది. మొదటి రోజునే అల్లుడు ముటముటలాడి పోయాడు. దాని క్కారణం తన త్యాగరాజ కీర్తనలట.

అస్తమానం అలా పాడుతుంటే తనకేం తోచదట. ఇల్లంటే ప్రశాంతంగా టాగోర్ గారి శాంతి నికేతనంలా ఉండాలట. అసలే వీధుల్లో రణగొణ ధ్వనులతో చస్తుంటే ఈ దిక్కు మాలిన గొడ వేమిటి? కూతురు వసుంధర కూడా భర్తకి వంత పాడింది. దేడియో, టీవీ, టేప్ రికార్డర్ ఉండి చచ్చాయిగా ... అని దీర్ఘం తీసింది. దాంతో తను కీర్తనలు పాడటం ఆపేసింది.

ఏవిటా వెధవ భక్తి ... పూజలూ, పునస్కారాలూ? తను తగ్గించేసింది. ఏవిటా అనారోగ్యం ... అంది. వృద్ధాప్యంలో ఆరోగ్యంగా ఉండటం అనేది తన చేతుల్లో లేదు కాబట్టి, సంచీ తీసుకుని ంటరిగా ఇంటికి వచ్చేసింది. అంతే, ఇక ఎప్పుడూ వాళ్ల ఇళ్లకి వెళ్ల లేదు. ఎందు కంటే రాముని సన్నిధి సేవే సుఖం కాబట్టి.


ఆస్తి పంపకాలు తన భర్త ఉండగానే జరిగి పోయాయి. ఆ దైతు మంచి వాడే. ఆ కొడుకు వెధవలకి, కూతురికి పెళ్లిళ్లు అయ్యాయి. ఉద్యోగా లొచ్చాయి. వాళ్ల బతుకేదో వాళ్లు చూసుకుంటారనే భరోసాతో భగవన్నామ స్మరణతో కాలక్షేపం చేస్తోంది.

టైమ్ ఒంటి గంటైంది.

బామ్మ గారు లేచి భోంచేసి గిన్నెలు సర్దేసి 'సా విరహే' పాడుకుంటూ నడుం వాల్చింది. నిద్ర పట్టేసింది. సాయంత్రం ఐదు గంట లైంది. లేచి చన్నీళ్లతో మొహం కడుక్కుని కాఫీ తాగి వంట చేసి మళ్లీ భగవద్గీత తీసింది.

మనసు నిలవ లేదు. జీవితం, అందులో. ఎగుడుదిగుళ్లు, తను పడ్డ కష్టసుఖాలు, ఆనందాలు,

**చిట్కా**



**చీమల బాధ భయంకరమైనది కదూ! సిగరెట్ పీకలలోని పొగాకును నీళ్లల్లో కలిపి చీమలున్నచోట పోస్తే చాలు.**

బంధు వర్గ పరివారాలు గుర్తొచ్చి కళ్లు చెమర్చాయి.

భర్త సర్య నారాయణ గుర్తొచ్చాడు. ఆయన మంచితనం, మాటకారితం గుర్తొచ్చాయి. ఆయన డబ్బూ, ఆస్తీ కూడబెట్టే పద్ధతి గుర్తొ చ్చింది. ఆయన తనని నవ్వించిన సంఘట నలు, ఏడిపించిన దృశ్యాలు గుర్తొచ్చాయి. అయితే ఏ సందర్భంలోనూ తనకి కోపం రాలేదు. అందరి మీదా జాలి వేసేది. అందరి పాపపుణ్యాలు చూడటానికి పైన భగవంతు డున్నాడు గదా అనుకునేది.

ఎందుకో ఒక్క సారి పరాత్పరుడికి నమస్కారం చేసి లేచి వెళ్లి భోంచేసి, టీవీ పెట్టింది. ఎవరో కవి గారితో ముఖాముఖి. ఆయన చెప్పిన నాలుగు మంచి మాటలు విని అది కట్టేసి, లైట్లు తీసేసి, బెడ్ లైట్ వేసి పడుకుంది బామ్మ గారు. మాగన్నుగా నిద్ర పట్టింది.

ఎంత రా త్రయిందో తెలీదు గాని ఎవరో తలుపు తడుతున్న శబ్దం వినిపించి మెల్లిగా లేచి లైటేసి తలుపు తీసింది. ఒక యువకుడు గబాలున లోపలికి వచ్చాడు. అతని భుజాని కో సంచీ ...

బామ్మ గారు చాలా ఆశ్చర్య పడింది. పకాలున నవ్వేసింది. "ఏరా నాన్నా, నా డబ్బూ, నగలే కావాల్సొచ్చాయా? ఎనభై ఏళ్ల వృద్ధురాలినిరా తండ్రీ!"

"నేను దొంగను కాను బామ్మ గారూ! ఇటు చూడండి ..." కుడి కాలు కొంచెం పైకెత్తి లైటు వెలుతురులో పెట్టి చూపించాడు. రక్తం సన్నగా బొట్లు బొట్లుగా గచ్చు మీద పడింది.

"అయ్యో ఇదేవిట్రా?" అనేసి అతని భుజం పట్టుకుని తీసుకెళ్లి మంచం మీద కూర్చో బెట్టి పైట కొంగు సర్రున చించి గుడ్డ ముక్కతో కట్టు కట్టేసింది.

"థాంక్స్! బామ్మ గారూ!" అన్నా డతను. బామ్మ గారు నవ్వేసింది. అతను మెల్లిగా వెనక్కి జరిగి మంచం మీద పడుకున్నాడు. బామ్మ గారు లేచి వెళ్లి ఫ్యాన్ వేగం పెంచి వచ్చి స్టూలు మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చుని అతని తల నిమురుతూ,

"శ్రీరామ రామ రామేతి
రమే రామే మనోరమే
సహస్ర నామ తత్తుల్యం
రామ నామ వరాననే" అంటూ చదవ సాగింది.

అతను మెల్లిగా కళ్లు తెరిచాడు. బామ్మ గారు ఆనందించింది.

"ఈ శ్లోకం చదివితే అన్ని రుగ్మతలూ, సమస్యలూ, బాధలూ తొలగి పోతయ్‌రా. చిన్నప్పుడు జ్వరం వస్తే మా అమ్మ ఇదే శ్లోకం పాడేది. వెంటనే జ్వరం తగ్గి పోయేది. చాలా రోజులు ఏ రకమైన జ బ్బొచ్చినా ఈ శ్లోకం చదివితే చా లనుకునే దాన్ని."

అతను నవ్వాడు.

"ఒరే అబ్బాయ్, నీ కా దెబ్బ ఎలా తగిలిందిరా?"

'తుపాకీ తూటా రాసుకుంటూ పోయింది.'

"రౌడీ వెధవలే కాల్చారా?"

"కాదు, పోలీసులు."

"వాళ్లతో తగాదాఎందు కొచ్చింది?"

"భూపోరాటం సాగిస్తున్నాం. భూస్వాముల భూముల్ని బీద వాళ్లు ఆక్రమించుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. పోలీసులకి అది తెలిసి మండి పడి పోయి ఇంతకు ముందే దాడి చేసి అరెస్టు చేయబోతే, ఎదురు తిరిగి రాళ్లు విసిరాం. వాళ్లకి ఇంకా కోపం వచ్చికాల్పులు జరిపితే కొంత



మందికి గాయాలు తగిలినై ...''

"భూములు ఆక్రమించడం తప్పు గదూ?'' అంది బామ్మ గారు చిరు కోపంతో.

"ఏం తప్పు? వాడికి అంత భూమి ఎక్కడ నించి వచ్చింది?''

"తాతతండ్రులు కష్ట పడి సంపాదించారు. వాడూ కష్ట పడి.''

నవ్వేశా డతను. "నిజం మీకూ తెలుసు.''

" ఊరి వాళ్లని ముంచేసి. అయినా అతని భూములు ఇవ్వ మని అడిగే హక్కు మన కేం ఉంది?''

"మీ ఇంట్లో పంచదార ఎం తుంది బామ్మ గారూ?''

"రెండు మూడు కిలోలు.''

" అదే లక్ష కిలోలుం దనుకోండి. అప్పుడు?'

"నాకెందుకు ... ఇచ్చేస్తా.''

''వా డివ్వ లేదు. పైగా బీదోళ్లని పీడించేస్తున్నాడు.''

"ఆ వెధవని తన్నాల్సిందే!'' అంది బామ్మ గారు.

అపరిచితుడు అభినందన పూర్వకంగా నవ్వేశాడు. అత నేదో అనబోయేంతలో మళ్లీ ఆవిడే అంది. "భోంచేశావురా నాన్నా?''

"చేశాను.''

"అబద్ధం .. నువ్వు అన్నం తినలేదు. అయినా రక్తం పోయిందిగా. నీరసంగా ఉంటుంది. నేను కొంచెం అన్నం కలుపు కొస్తాను.''

పక్కన కూర్చుని అతనికి అన్నం తినిపించింది.

"అన్నం ఎక్కువ లేదురా నాన్నా. చిన్నప్పుడు మానాన్న అనే వాడు, ఈ పూట ఎవరికైనా అన్నం పెడితే బోలెడు పుణ్యం వస్తుందని - ఈ పూట నీకు అన్నం పెట్టి పుణ్యం సంపాదించుకున్నాను' ' అంది బామ్మ గారు ముసిముసిగా నవ్వుకుంటూ.

అతని కళ్లు చెమర్చాయి.

"అవునూ, నీదే ఊరురా అబ్బాయ్?''

"జగిత్యాల. కరీం నగర్ జిల్లా.''

"ఇక్కడ కెందు కొచ్చావు?''

" భూపోరాటం ప్రారంభించడానికి.''

"పేరు?''

" వెంకట రెడ్డి.''

"పేరు బాగుంది. ఉండు, ఇప్పుడే వస్తా'' అని లోపలికి వెళ్లి ఒక ప్లేటులో జంతికలు, రవ్వ లడ్లు తెచ్చిచ్చింది. వెంకట రెడ్డి తిన్నాడు. బామ్మ గారు అల్మరా తెరిచి అయోడిన్ సీసా, బోరిక్ పౌడర్ తీసుకొచ్చి అంతకు ముందు కట్టిన గుడ్డ తీసేసి, అయోడిన్ రాసి పౌడర్ వేసి మళ్లీ గట్టిగా కట్టు కట్టింది.

"ఏరా రెడ్డీ, చూస్తే బీద వాడిలాగా ఉన్నావు. డబ్బేమన్నా కావాలా?''

"వద్దు .. థాంక్స్.''

"అవునూ, భూములు ఆక్రమించు కోవడానికి బీద వెధవలు నన్నాహాలు చేస్తున్నట్టు ఆ భూస్వామి కెలా తెలిసింది?''

"పోలీసులే చెప్పారు.''

"అవునూ, అసలు వాళ్లకి మీ మీద ఎందుకూ కోపం?''

"అంతకు ముందు మేం ఈ ప్రాంతంలో ఒక భూస్వామిని చంపేశాం.''

"అర్రెర్రెర్రె ... తప్పు గదురా నాన్నా!'' అంది బామ్మగారు.

"మరి ఆస్తి తగాదా లంటే అంతే!''

"ఎంతైనా?''

"దుర్యోధనుణ్ని ఎందుకుచంపేశారు?''

"వాడు దుర్మార్గుడు. అసూయాపరుడు. మర్యాదగా ఆస్తి ఇచ్చేసి ఉంటే బతికి పోయే వాడు. వాడు ఇవ్వ లేదు. పైగా పాండవుల్ని నానా బాధలూపెట్టాడు.''

''మేం పాండవులం ...భూస్వాములు కౌరవులు.''

"ఇం కేమన్నా తింటావా?''

"వద్దు.''

"భగవంతుడు సర్వాంతర్యామిరా. వాడు నీకూ, నీలాంటి వాళ్లకి ఆయురారోగ్యాలు ప్రసాదిస్తాడు. మీదే విజయం.''

వెంకట రెడ్డి నవ్వేసి ఆవులించి నిద్ర పోతానని చెప్పి నిద్ర పోయాడు. బామ్మ గారికి నిద్ర పట్ట లేదు. మంచం మీదున్న అతని చేతి సంచీ తీసి గోడ మేకుకు తగిలించింది. అతను మళ్లీ లేచి నీ ళ్లడుగుతాడేమో, మళ్లీ ఆకలేస్తుందేమో, అనుకుంటూ, శ్లోకాలు, కీర్తనలూ చదువుకుంటూ అలాగే కూర్చుండి పోయింది.

దూరంగా తొలి కోడి కూత వినిపించింది. వెంకట రెడ్డి లేచాడు.

"వస్తాను బామ్మ గారూ! మళ్లీ కలుద్దాం.''

"ఎప్పు డొస్తావురా నాన్నా మళ్లీ?''

" చెప్ప లేను.''

"ఈ సారొస్తే నీకు పులిహోర, బొబ్బట్లు చేసి పెడతాను.''

"థాంక్స్ బామ్మ గారూ. ఇంతకీ నే నెవర్నో మీరు అడగ లేదు. అయినా చాలా శ్రమ పడి ఇంత సహాయం చేసి పెట్టారు.''

"ను వ్వెవరివైతే నా కెందుకురా బంగారు తండ్రీ? మా ఇంటి కొచ్చావు. నాకు తోచిన సహాయం చేశాను. మనిషికీ, మనిషికీ మధ్య సంబంధంరా మనది.''

నవ్వుతూ బామ్మ గారికి పాదాభివందనం చేసి తలుపు తీసి వెళ్లి పోయాడు.

బామ్మ గారికి అప్పుడు గు ర్తొచ్చింది, అతని చేతి సంచీ ఇంట్లోనే ఉండి పోయిందని.

ఆ సంచీ తీసుకుని గబగబా బైటికి వెళ్లి "ఒరేయ్ రెడ్డీ!'' అని పిలిచింది గాని అతనే తిరిగి రాలేదు.

వెనక్కి తిరిగొచ్చి ఆ సంచీ తెరిచి చూసింది. ఒక మఫ్లర్, ఒక చొక్కా, ప్యాంటు ...ఒక పుస్తకం.

బామ్మ గారు ఆ పుస్తకం తెరిచి చూసింది. అంతే...!ఆమె నోటి వెంట అలవోకగా ఉద్యమ గీతం వెలువడింది.

"అన్నలు అన్నా లెన్నీయలో
వెలుగూ కిరణా లెన్నీయలో
ఒరిగిన అన్నల కెన్నీయలో
ఎర్రెర్రని దండా లెన్నీయలో...!''

●

## జోక్

పట్టపగలే ఇల్లు దోచుకున్నారు. పోలీసులు వచ్చి ఆ ఇల్లాలిని అడిగారు - 'దొంగలు దోచుకుంటున్నప్పుడు 'మీరేం చేస్తున్నారు?' అని. 'టీ వీలో దొంగల దోపిడి సినిమా చూస్తున్నాను' అనింది ఆ ఇల్లాలు.

చిదానందం